క్లుప్తంగా

వాలీబాల్ జట్టు ఎంపిక

పెనుగొండ: ఆచంట నియోజకవర్గ వాలీ జట్టుకు అండర్–14, అండర్–17 జట్లులో ప్రతిభ కనబరిచిన ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీల ఇన్‌చార్జి కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం కొడమంచిలిలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల నుంచి వీరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి ఉత్తమ శిక్షణ కల్పించి జిల్లా పోటీలకు పంపిస్తామన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారు జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటరన్నారు. నియోజకవర్గ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను కొడమంచిలి సర్పంచ్ సుంకర సీతారామ్ అభినందించారు. కార్యక్రమంలో స్కూలు చైర్మన్ బొరుసు రాంబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు సాక సురేష్, ప్రధానోపాధ్యాయుడు పి.రామకృష్ణ, స్కూలు పీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

యలమంచిలి: పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్ చెప్పారు. పోషకాహార మాసోత్సవాలు, ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్ పోగ్రాంలో భాగంగా గురువారం ఆయన కలగంపూడి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి బిడ్డలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి, పలు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా అంగన్‌వాడీ టీచర్ బండి జ్యోతిరాణి, ఏఎన్‌ఎం వడ్డి కృపావతి ఎంఎల్‌హెచ్‌పీ ఒడుగు మధులత, ఆశ కార్యకర్త కడలి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఎన్‌ఎం కళాశాలలో శాంతి దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: భారతదేశం మొదటి నుంచి శాంతికాముఖ దేశమని అహింస ద్వారా శత్రువులను జయించవచ్చని నిరూపించిన దేశం భారతదేశమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి అన్నారు. గురువారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఐక్య రాజ్యసమితి 2001 సెప్టెంబర్ 21న అంతర్జాతీయ శాంతి దినోత్సవంగా నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో పొలిటికల్ డిపార్ట్‌మెంట్ ఇంచార్జ్ టి కృష్ణ, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ విజయలక్ష్మి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా గురజాడ జయంతి

పెనుమంట్ర: యోజనాలను వాడుక భాషలో నాటకం కవిత్వం కథలు రాయడం ద్వారా గురజాడ నిరూపించారని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేత పద్మజ అన్నారు. గురువారం పెనుమంట్ర మండలం పొలమూరు ఉన్నత పాఠశాలలో ఐద్వా ఆధ్వర్యంలో గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకను జరిపారు. ఈసందర్భంగా పద్మజ మాట్లాడుతూ పుత్తడి బొమ్మ , పూర్ణమ్మ గురజాడ రచించిన కరుణ రసాత్మక గేయం, ఇతివృత్తం కానీ, దురాచారం నాటి సమాజంలో కన్యాశుల్కం దురాచారానికి బలవుతున్న బాలికల పట్ల పట్ల అత్యంత కరుణతో చిన్నారి బాలికలకు ప్రతినిధిగా పూర్ణమ్మమ అనే పాత్ర సృష్టించి కళాత్మక కావ్యంగా రూపొందించారని అన్నారు. పొలమూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సరస్వతి, జిల్లా కమిటీ సభ్యురాలు కేతా పద్మజ, హేమలత తదితరులు గురజాడ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: ప్రముఖ తెలుగు కవి, తన రచనలు ద్వారా సాంఘీక పరివర్తనకు కృషి చేసిన గురజాడ అప్పారావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముత్యాలపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానిక పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఎస్ చక్రవర్తి, గుడాల తాతారావు, బొక్కా రాజేశ్వరి, నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం


చెల్లెం ఆనందప్రకాష్


పాలకొల్లు అర్బన్: మహిళా బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళా బిల్లు ఆమోదం అన్ని పార్టీల విజయంగా భావించాలని పేర్కొన్నారు. నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ హిందూ కోడ్ బిల్లును రూపొందించి పార్లమెంట్‌లో ప్రవేశపెడితే అప్పటి పురుషాధిక్యత ప్రభావంతో ఆ బిల్లు వీగిపోయిందని గుర్తుచేశారు. దీనికి బాధ్యత వహించి న్యాయశాఖ మంత్రి పదవికి అంబేడ్కర్ రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే మహిళలకు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని వివరించారు. 2024 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఈ బిల్లు కార్యరూపం దాల్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే రాజ్యాంగ సవరణ ద్వారా డీలిమిటేషన్ చేసి మహిళా బిల్లు అమలు చేయాలని కోరారు.


జయజయ శుభకర వినాయక..!

- గ్రామాల్లో ఉత్సాహంగా గణపతి నవరాత్రులు
- ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


పోడూరు: జిన్నూరు కొత్తపేటలో పూజలందుకుంటున్న గణనాథుడు


మొగల్తూరు: కడలివారిపాలెంలో నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువకులు


నరసాపురం: చినమామిడిపల్లిలో ఏర్పాటు చేసిన భారీ గణపతి


నరసాపురం రూరల్: తెలగంశెటివారి మెరకలో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు


పెనుమంట్ర: గోస్తనీ నదిలో గణపతి నిమజ్జనం చేస్తున్న దృశ్యం

నరసాపురం: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీగా వినాయక మండపాలు ఏర్పాటు చేసి చవితి పూజలు చేస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభమై నాలుగో రోజుకు చేరడంతో గురువారం అన్ని మండపాల వద్ద పెద్ద ఎత్తున పూజలు చేశారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. పండ్ల మార్కెట్‌సెంటర్, పంజాసెంటర్, రాయిపేట మూడుబొమ్మల సెంటర్, చినమామిడిపల్లి, శనివారపుపేట, పీచుపాలెం, వనువులమ్మగుడి, పొన్నపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసి భారీ గణపతి విగ్రహాలను పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించి పూజలు చేస్తున్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: వినాయకచవితిని పురస్కరించుకుని గురువారం ఘనంగా వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పేరుపాలెం కేపీ పాలెం, కాళీపట్నం గ్రామాల్లో వినాయకుడినకి ఊరేగించి నిమజ్జనాలు చేశారు. మొగల్తూరు కడలివారిపాలెం యూత్ ఆధ్వర్యంలో వినాయకున్ని గ్రామంలోని పలు వీదుల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే కేపిపాలెం బీచ్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఏర్పాటు చేసిన 13 కేజీల లడ్డూను అదే గ్రామానికి చెందిన సత్తినేని సుబ్బారావు,కుంపట్ల ప్రసాద్‌లు అందించారు. గురువారం వినాయకుని నిమజ్జనం సందర్భంగా లడ్డూను వేలం వేయగా అదే గ్రామానికి చెందిన నారిన సుబ్రమణ్యం రూ.5 వేలకు దక్కించుకున్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: వినాయకచవితి సందర్భంగా గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. డీజే సౌండ్స్, తీన్‌మార్ డప్పుల మధ్య బాణా సంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటు వినాయకుని విగ్రహాలను గ్రామ వీధులలో ఊరేగించారు. ఊరేగింపు అనంతరం విగ్రహాలను దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం, అబ్బిరాజుపాలెం, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక, బాడవ గ్రామాల్లోని వశిష్ట గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. యువకులతోపాటు మహిళలు కూడా నిమజ్జన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

గణపతి మండపం వద్ద విష్ణు పారాయణం

పాలకొల్లు సెంట్రల్: గణపతి నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు భక్తులు గణపతికి యదాలాపంగా పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. స్థానిక అచ్చుగట్లపాలెం బొర్రావారి తోటలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద మహిళలు విష్ణు సహస్రనామం, వినాయక గానామృతం చేశారు. అలాగే పలు మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. చిన్నపిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో వివిధ గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెనుమంట్రలోని ఊసల రామాలయం యూత్ ఆధ్వర్యంలో గణపతిని పుష్ప వాహనంపై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గోస్తనీనదిలో గణపతిని నిమజ్జనం చేశారు. రజకపేట, రాధాకృష్ణ ఆలయంలో ప్రతిష్టించిన గణపతి విగ్రహాన్ని రజకసేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించి గోస్తనీ కాలువలో నిమజ్జనం చేశారు. పెనుమంట్ర శివాలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి మందిరంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉప సర్పంచ్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మార్టేరు, పాలమూరు, నత్తారామేశ్వరం, జుత్తిగ గ్రామాలలో కూడా వినాయక నిమజ్జనోత్సవాలు జరిగాయి.

గణనాథునికి గరికపూజ

పోడూరు: జిన్నూరు కొత్తపేటలో గణపతి నవరాత్రుల వేడుకను స్థానిక యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం వినాయకునికి గరికపూజ, విశేషపూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యూత్ సభ్యులు పెన్మెత్స మణికంఠవర్మ, ఆచార్యులు, ఎస్‌వీ దుర్గాప్రసాద్, చల్లపల్లి తేజ, హేమంత్, చరణ్‌సాయి, జి.హేమ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

పోడూరులో..

పోడూరు శివారు పల్లపువీధి, పూజారివారిగరువులో గణపతి నవరాత్రుల వేడుక ఘనంగా నిర్వహించారు. వినాయకుడిని ఘనంగా ఊరేగించి నిమ్మజ్జనం చేశారు. పూజారివారిగరువులో సాయంత్రం అన్నసమారాధన జరిపారు.

పెనుగొండలో..

పెనుగొండ: మండలంలోని వడలి గ్రామ కమ్మ సంఘం ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనత్సోవం కనుల పండుగగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి వడలిలో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సిద్ధాంతం కేదారీఘాట్‌లో నిమజ్జనం నిర్వహించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా పెనుగొండ, వడలి, సిద్ధాంతం, ఆచంట మండలంల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలోని గణనాథుడు 4వ రోజు గురువారం పూజలందుకున్నాడు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: గణపతి నవరాత్రుల ఉత్సవాలు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. మండలంలోని పసలదీవి, కె.బేతపూడి, వేములదీవి తదితర గ్రామాల్లో ఐదో రోజున ఉత్సవ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను మూడవ రోజునే నిమజ్జనోత్సవాలు చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు అలరిస్తున్నాయి. తెలగంశెట్టి మెరకలో 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


యలమంచిలి: దొడ్డిపట్లలో వశిష్ట గోదావరి నదిలో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు


పెనుమంట్ర: ఊసల రామాలయానికి చెందిన గణపతి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


పాలకొల్లు సెంట్రల్: విష్ణు సహస్రనామం పారాయణం చేస్తున్న మహిళలు

డీఎన్నార్ కళాశాలలో నాక్ బృందం పర్యటన

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పర్యటించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. నాక్ బృందం పర్యటన వివరాలను గురువారం విలేకరులకు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రొఫెసర్, వైస్ చాన్సలర్ దేవకి నందన్ గోస్వామి సారథ్యంలో కర్ణాటకకు చెందిన ప్రొఫెసర్ మీనాక్షి, తమిళనాడుకు చెందిన ప్రొఫెసర్ మైథిలి శ్రీనివాసన్‌ల బృందం సభ్యులు కళాశాల తరగతి గదులు, ప్రయోగశాలలు, రికార్డులు తనిఖీ చేశారన్నారు. బుధ, గురువారం రెండు రోజులు పాటు నాక్ సభ్యులు పర్యవేక్షణలో పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు వారి తల్లిదండ్రులు, కళాశాల కమిటీ సభ్యులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారన్నారు. పర్యవేక్షణ అనంతరం రిపోర్ట్ తయారు చేసి సీల్డ్ కవర్‌లో అందజేసి వారం రోజులు తరువాత సీల్డ్ కవర్ తెరవాలని సూచించినట్లు తెలిపారు.

నరసాపురంలో భారీ వర్షం


మొగల్తూరు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు: నరసాపురం నియోజకవర్గంలో బుధవారం రాత్రి నుండి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. మొగల్తూరులో 68.4, నరసాపురంలో 41.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో నరసాపురం మండలంలోని వేములదీవి, కొప్పర్రు, ఎల్‌బీచర్ల, మొగల్తూరు మండలంలోని పేరుపాలెం, కాళీపట్నం, కేపీ పాలెం, మొగల్తూరులోని మస్జీద్ సెంటర్, స్టేషన్ రోడ్డు, పాతకాలువ, గాంధీ బొమ్మల సెంటర్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులతో పాటు వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. నరసాపురం పట్టణంలో వర్షంతో ఉదయం పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

5న ద్వారకాతిరుమలకు పాదయాత్ర

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రధానార్చకులు ఎస్‌టీపీవీ రమణ గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీ పంచముఖ క్షీరపురి ద్వారకాతిరుమల పాదయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ సేవా సమితి సభ్యులు గురువారం తెలిపారు. ఈ యాత్ర 11వ పర్యాయం చేస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 5 సాయంత్రం 4:05 గంటలకు పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా ఆలయం వద్ద సేవా సమితి సభ్యులకు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే యాత్రలో పాల్గొనే భక్తులు తెల్లచొక్కా, తెల్లలుంగీ లేదా ప్యాంటును ధరించాలన్నారు. 18 ఏళ్ల నుంచి 62 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన భక్తులు ఈ యాత్రలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

మార్పు చేసిన పోలింగ్ స్టేషన్ల పరిశీలన


పాలకొల్లు అర్బన్: పెంకుళ్లపాడులో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

పాలకొల్లు అర్బన్: అన్ని వసతులతో కూడిన పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుకు నియోజకవర్గ ఈఆర్వోలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలిచ్చారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలోని పెంకుళ్లపాడు, అలాగే పట్టణంలో 20వ వార్డు ఎస్సీ కాలనీలో మార్పు చేసిన పలు పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో ఈఆర్ఓ, తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రశాంతి గురువారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ స్టేషన్లు గదులు, విద్యుత్, డోర్స్, కిటికీలు, టాయిలెట్స్, ర్యాంపులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రెండు కిలోమీటర్ల పరిధిలో కచ్చితంగా పోలింగ్ స్టేషన్ ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో పూర్తిగా మౌలిక సౌకర్యాలు కల్పించి, దివ్యాంగుల కోసం ర్యాంపును ఏర్పాటును మరోకసారి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఓటర్ల జాబితా ప్రకారం 1500 ఓటర్లు లోపు ఉంటే ఒక పోలింగ్ స్టేషన్, 1500 ఓటర్లు దాటితే అదనపు పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు తప్పనిసరిగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలిచ్చారు. ఒకే కుటుంబం, ఒకే అపార్టుమెంటులో నివసిస్తున్న ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ స్టేషన్లో ఓటు వినియోగించుకునేలా క్రమబద్ధీకరించాలన్నారు. కలెక్టర్ వెంట నియోజకవర్గ ఈఆర్‌వో, డీఎల్‌డీవో కేసీహెచ్ అప్పారావు, తహసిల్దార్ సీహెచ్ పెద్దిరాజు, మునిసిపల్ కమిషనర్ బీఆర్‌ఎస్ శేషాద్రి, టీపీఓ వీరబ్రహ్మం, డిప్యూటీ తహసీల్దార్ వి.బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లపై నివేదిక అందించాలి

నరసాపురం రూరల్: నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పోలింగ్ స్టేషన్ల స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గురువారం మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్, నరసాపురం మండలం పసలదీవి, లక్ష్మణేశ్వరం, మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు శివాలయం వీధి పోలింగ్ స్టేషన్లను క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, తహసీల్దార్‌లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి ఆర్డీఓ, జిల్లా రెవిన్యూ అధికారి కె.కృష్ణవేణి, తహసీల్దార్‌లు ఫాజిల్, అనితా కుమారి, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్లు కె.నాగదేవి, బి.సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సీఏలకు సీఎం జగన్ న్యాయం చేస్తారు


డ్వాక్రా సీఏలతో పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: డ్వాక్రా మహిళలకు విశేష సేవలందిస్తున్న కమ్యూనిటీ యాక్టివిస్టులందరికీ (సీఏలు) జీతాలు పెంచాలనే ఆలోచనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో వైఎస్సార్ కాంతి పథకం (వెలుగు)లో పనిచేస్తున్న కమ్యూనిటీ యాక్టివిస్టు (సీఏ)లను పరిచయం చేసుకుని మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోపే సీఏలంతా తీపి కబురు వింటారని వివరించారు. సీఏలుగా విధులు నిర్వహిస్తున్న వారంతా ఎంతో బాధ్యతాయుతంగా పని చేస్తున్నారని ప్రశంసించారు. మీ సేవలకు వెలకట్టలేమని గోపి వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతీ ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. మహిళలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ మహిళా పక్షపాతిగా గుర్తింపు పొందిన సీఎం జగన్‌ను మళ్లీ రెండో సారి సీఎంగా ఎన్నుకోవడానికి డ్వాక్రా అక్కచెల్లెమ్మలంతా సహకరించాలని కోరారు. గతంలో జీతాలు లేకుండా డ్వాక్రా మహిళలకు సీఏలు సేవలందించేవారని, అయితే వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి రూ.10వేలు వేతనం ప్రకటించారని వివరించారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తున్న సీఎం జగన్‌ను ప్రతీ ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, దెందులూరు పార్టీ పరిశీలకుడు యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పార్టీ నాయకులు కొండేటి రవి, బి బాబి, ఏపీఎంలు కలిగితి జ్యోతిరాణి, సోని, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పోడూరు: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి అన్నారు. వద్దిపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్.ఇందిర ఆధ్వర్యంలో 'పోషణ మహ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, పౌష్టికాహార ప్రదర్శన, కిశోరబాలికలకు, గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ నాగపద్మావతి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల ఆరోగ్యపరంగా అనేక సమస్యలు కూడా ఎదురవుతాయన్నారు. ముఖ్యంగా కిశోర బాలికలు ప్రతీరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గొల్ల బేబీ కుమారి, జి.నోమేశ్వరి, వై.శాంతకుమారి, యు.సుజాత, జె.నాగసత్యవతి తదితరులు పాల్గొన్నారు.

తిల్లపూడిలో

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా తీసుకుంటే రక్తహీనత సమస్యలు రావని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎస్.మంగ అన్నారు. మండలంలోని తిల్లపూడిలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం బాలింతలు, గర్భిణులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, లక్ష్మి, వెంకటలక్ష్మి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం

నరసాపురం రూరల్: విద్యార్థుల ఉన్నత లక్ష్యాల సాధనకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని స్వర్ణాంధ్ర కళాశాల కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ అన్నారు. గురువారం స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభం సందర్భంగా జరిగిన తల్లిదండ్రుల సమావేశంలోఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ పండరీనాథ్, డాక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించారని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. ఆచంట మండలం కొడమంచిలిలో జగనన్న ఆరోగ్య సురక్షను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రుపాంజలి, ఏఎన్‌ఎం వెంకటరమణ, డి.పుష్పరాజ్యం పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న పురందేశ్వరి

మొగల్తూరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గురువారం ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ప్రధాని మోదీ జన్మదినం వేడుకల్లో భాగంగా నరసాపురంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించేందుకు విజయవాడ నుంచి విచ్చేసిన ఆమె ముత్యాలపల్లిలోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.